క్లుప్తంగా

ఓటుహక్కుకు ఆధార్ సీడింగ్ చేయండి

ఎర్రగుంట్ల : మండల పరిధిలో ఉన్న ఓటర్లకు సంబధించి ఓటు హక్కుకు ఆధార్ సీడింగ్ చేయాలని తహసీల్దార్ ఎ.నాగేశ్వరరావు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలకు సమావేశం నిర్వహించి ఆదేశించి మాట్లాడారు. ఆధార్ సీడింగ్ ప్రస్తుతం చాలా ముఖ్యమని ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని వారికి సూచించారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

కమలాపురం : బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర హక్కుల సాధన కోసం ఈనెల 9వ తేదీన విజయవాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్మిక, కర్షకుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కామనూరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. శనివారం కమలాపురంలో ఆయన ఇతర నాయకులతో కలసి రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీల కతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఈ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీదేవి, జిల్లా కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, ఆటో యూనియన్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన

లింగాల : కామసముద్రం గ్రామంలో సాగు చేసిన పంటలకు జరిగే ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను ఏఓ రమేష్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ పంటలను సాగు చేసిన ప్రతి రైతు ఈ–క్రాప్ నమోదుతో పాటు ఈకేవైసీ విధిగా చేయించుకోవాలన్నారు. అలా చేయించుకున్న రైతులకు పంటల బీమా, మద్దతు ధర, పంట నష్టపరిహారం అందుతాయన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని కదిరివారిపల్లె గ్రామ మాజీ సర్పంచ్ కదిరి దామోదర్‌రెడ్డి (60) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కదిరివారిపల్లె గ్రామ సర్పంచ్‌గా సుమారు 30 సంవత్సరాల నుంచి ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ప్రస్తుతం ఆయన సతీమణి కదిరి జయప్రద కదిరివారిపల్లె గ్రామ సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. ఎర్రగుంట్ల మున్సిపల్ ఛైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీపీ మూలె లక్ష్మీదేవి, సిమెంట్ ఫ్యాక్టరీ కార్మిక నాయకులు రమణారెడ్డిలు వెళ్లి సంతాపం తెలియజేశారు.

వృద్ధురాలికి పింఛన్ పంపిణీ



ఆసుపత్రిలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ మునిప్రతాప్

లింగాల : లోపట్నూతల గ్రామానికి చెందిన వికలాంగురాలు త్రివేణి అనే మహిళ అనారోగ్యం కారణంగా తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వలంటీర్ మునిప్రతాప్ శనివారం తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేశారు. ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపినట్లు వలంటీర్ తెలిపారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న విద్యార్థిని


పులివెందుల టౌన్ : పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాలలో శనివారం కడప రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ అమల్‌రాజ్ హాజరై మాట్లాడుతూ రక్తదానం చేయడంవల్ల ఆరోగ్యంగా ఉండటమేకాక ఇతరుల ప్రాణాలను కాపాడటం జరుగుతుందన్నారు. అలాగే స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, ఆర్ఆర్‌సీ జిల్లా ఇన్‌చార్జి సుధాకర్‌లు సొసైటీ అభివృద్ధికి తమవంతు సాయం చేయాలన్నారు. ఆర్ఆర్‌సీ వైఆర్‌సీ నోడల్ ఆఫీసర్ ఉదయ్‌కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ ఆంటోని పాల్, అధ్యాపకులు శంకరయ్య, విద్యార్థులు, కళాశాల బృందం పాల్గొన్నారు.

జేవీవీ క్యాలెండర్, డైరీలు ఆవిష్కరణ

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఏ నాగేశ్వరరావు చేతుల మీదుగా జనవిజ్ఞాన వేదిక నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను శనివారం ఆవిష్కరించినట్లు జేవీవీ జిల్లా కార్యదర్శి సుజనకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21, 22 తేదీలలో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను కడపలోని జయరాజ్ గార్డెన్స్ నందు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ లక్ష్మీదేవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల జీవితాలలో సంక్షేమ వెలుగులు

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలను అడిగి తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సింహాద్రిపురం : పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. శనివారం పైడిపాలెం గ్రామంలో రెండవరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూనే.. సంక్షేమ పథకాల లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఏ కుటుంబానికి ఎంత మేర లబ్ధి చేకూరిందో వారికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ ద్వారా వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తూ పేదల జీవితాలలో సంక్షేమ వెలుగులు నింపుతున్నారన్నారు. అందువల్లనే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతి గడపకు ధైర్యంగా వెళ్లి ప్రజల యోగక్షేమాలను తెలుసుకోవడంతోపాటు ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకుంటున్నారన్నారు. ఇటీవల మృతి చెందిన రైతు ఓబులేసు భార్య బీమా, ఇన్సూరెన్స్, రైతు భరోసా డబ్బులు పడలేదని ఎంపీ దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన ఎంపీ అధికారులతో మాట్లాడి త్వరలోనే ఆమెకు పింఛన్, బీమా, రైతు భరోసా అందేటట్లు చూడాలన్నారు. అలాగే కొందరు సదరం సర్టిఫికెట్లు తప్పుల తడకగా వస్తున్నాయని ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా.. తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం చవ్వారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీకి ఎంపీ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉద్యానశాఖ రాష్ట్ర మెంబర్ శివప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, అధికారులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చవ్వారిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం

మండల పరిధిలోని చవ్వారిపల్లె గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ అవినాష్‌రెడ్డి పాల్గొంటారని మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, హాజరుకావాలని ఆయన కోరారు.

గడప గడపలో వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించాలి

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. కమలాపురం నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలపై కడప నగరంలో ఆయన శనివారం అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని వారికి మరింత మేలు చేకూర్చడం కోసం గడప గడపకు కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించి సీఎం ఆశయ సాధనకు కృషిచేయాలన్నారు. అనంతరం ఆయన నియోజకవర్గంలోని మండలాల వారీగా అధికారులు, ప్రజాప్రతినిధులతో వచ్చిన సమస్యలపై ఆరా తీసి ఒకవేళ సమస్య పరిష్కారం కాకుంటే వెంటనే పరిష్కరించాలన్నారు. ఇకపై గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై నెలకొకసారి సమీక్ష నిర్వహిస్తామన్నారు. సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజా ప్రతినిధులు సైతం తమ గ్రామాల పరిధిలో ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గంలోని ఆరు మండలాల వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీగాయత్రి

వేంపల్లె : మండల వ్యాప్తంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీపీ లక్ష్మీగాయత్రి శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయాల వారీగా సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమావేశంలో కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ ఇళ్ల నిర్మాణాలలో భాగంగా పునాదులు పూర్తి చేసిన వారికి మిగిలిన గోడలు, శ్లాబ్ వేయించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాలనీలకు అన్ని మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఇసుక, సిమెంటు లబ్ధిదారులకు అందిస్తోందన్నారు. జులై నెలలోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తిస్థాయిలో కట్టించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ రవీంద్రారెడ్డి, ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి, హౌసింగ్ ఏఈ సుబ్రమారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బనాన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌తో గిట్టుబాటు ధర



మాట్లాడుతున్న హార్టికల్చర్ ఆఫీసర్ అజయ్‌కుమార్

పులివెందుల రూరల్ : రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికే బనాన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభించనున్నామని ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ హార్టికల్చర్ ఆఫీసర్ అజయ్‌కుమార్ తెలిపారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లెలో జరుగుతున్న బనాన ప్రాసెసింగ్ యూనిట్ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. బనాన ప్రాసెసింగ్ యూనిట్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయని.. నిర్మాణ పనులు పూర్తైన తర్వాత రైతు సంఘానికి నిర్వహణ బాధ్యతను అప్పగిస్తామన్నారు. ఈ యూనిట్‌లో డ్రయిడ్ హనీ బనాన, బనాన పౌడర్, బనాన స్టెమ్‌జ్యూస్, బనాన ఫైబర్ బేస్డ్ ప్రాడక్ట్స్ తయారు చేసుకునే యంత్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ అధికారులు అనిల్‌కుమార్, రాష్ట్ర కో ఆర్డినేటర్ సునీల్‌బాబు, రైతు సంఘ ప్రతినిధులు బలరామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోండి

చక్రాయపేట : మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్ పోస్టులకు అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవాలని సూపర్‌వైజరు హైమావతి తెలిపారు. మండలంలో తిమ్మారెడ్డిగారిపల్లె(బీసీ–డీ), గాజులపేట(ఓసీ), అవు లవాండ్లపల్లె(ఓసీ), చక్రాయపేట దళితవాడ(ఎస్సీ)లకు రిజర్వు చేయబడిన అంగన్‌వాడీ వర్కర్ పోస్టులు ఉన్నాయన్నారు. అలాగే సురభిమాలపల్లె(ఎస్సీ)కి మినీ వర్కర్ పోస్టు ఖాళీగా ఉందన్నారు. దరఖాస్తులను లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ కార్యాలయంలో ఈనెల 11వ తేదీలోపు అందజేయాలన్నారు. 12న ఇంటర్వ్యూలకు వరిజినల్ సర్టిఫికేట్‌లతో హాజరుకావాలని ఆమె తెలిపారు.

12న మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్

చక్రాయపేట : ఈనెల 12వ తేదీ నుంచి చక్రాయపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఆటస్థలంలో మండలస్థాయి క్రికెట్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.30,116లు, రెండవ బహుమతి రూ.20,116లు నగదుతో పాటు టోర్నమెంట్ ఇస్తామన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 11న సాయంత్రం లోపు రూ.1000 ఎంట్రీ ఫీజు చెల్లించి చక్రాయపేటలోని వాసు ఫొటో స్టుడియోలో పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

12న వాహనాలకు వేలం పాట

జమ్మలమడుగు : అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన ద్విచక్రవాహనాలను ఈనెల 12వ తేదీన వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ కె.ఎస్.లత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఆధార్‌కార్డు, ఏదైన గుర్తింపు కార్డులతో పాటలో పాల్గొన వచ్చునన్నారు. గురువారం ఉదయం ముద్దనూరు రహదారిలో ఉన్న ఆర్డీఓ కార్యాలయం వెనుకవైపు ఉన్న తమ కార్యాలయంలో వేలం పాట ఉంటుందన్నారు. వేలం పాటలో వాహనం దక్కించుకున్నవారి పేరుమీద వాహనాలను రిజిస్ట్రేషన్ చేయించడం జరుగుతుందన్నారు.

స్మశాన వాటిక స్థలాన్ని కాపాడండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన కాలనీ వాసులు

వేంపల్లె : మండల పరిధి అలవలపాడు గ్రామంలోని ఎస్సీ కులానికి చెందిన స్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని శనివారం ఎంపీపీ లక్ష్మీగాయత్రితో కలిసి ఆ కాలనీ ప్రజలు తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ కాలనీ సమీపంలో ఉన్న సర్వే నెంబర్ 474/1లో పూర్వీకుల నుంచి స్మశాన వాటిక ఉందన్నారు. అయితే కొన్ని రోజులుగా అదే గ్రామానికి చెందిన డి.వెంకటరమణారెడ్డి స్మశాన వాటిక స్థలంలో మట్టిని తోలించి ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. తహసీల్దార్ స్పందించి అది ప్రభుత్వ స్థలం అని ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఈ విషయాన్ని జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. సర్వే చేయించి ఆ స్థలంలో బోరు వేయించి కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయిస్తామని కాలనీ వాసులకు ఆయన భరోసా ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ మండల కన్వీనర్ జయరాములు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

జీవామృతంతో భూసారం పెరుగుతుంది



జీవామృతం తయారు చేసే విధానాన్ని తెలియజేస్తున్న వ్యవసాయాధికారి శ్రీదేవి

చెన్నూరు : జీవామృతం వల్ల భూసారం పెరగడమే కాకుండా రైతులకు అధిక దిగుబడులు వచ్చేందుకు తోడ్పడుతుందని మండల వ్యవసాయాధికారి శ్రీదేవి తెలిపారు. శనివారం ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నాచురల్ ఫార్మింగ్ వారి ఆధ్వర్యంలో మండలంలోని నరసారెడ్డిపల్లెకు చెందిన రైతు వెంకటేశ్వరరెడ్డి వరి పొలంలో 200 లీటర్ల ద్రవ జీవామృతం తయారు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ వరిలో ఈ ద్రవ జీవామృతం 15 రోజులకు ఒకసారి పారించాలని తెలిపారు. దీనివల్ల భూమి సారవంతంగా మారుతుందన్నారు. రామనపల్లిలో రైతు పోలిశెట్టి శివరామకృష్ణ వరి పొలంలో నారు శుద్ధి చేయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రామనపల్లె ఆర్బీకే ఇన్‌చార్జి సునీల్‌కుమార్, ఏపీ సీఎన్ఎఫ్ మండల ఇన్‌చార్జి ఓబులయ్య, ఆర్బీకే ఇన్‌చార్జి సలోమి, పీఆర్పీ మేరి, యూనిట్ ఇన్‌చార్జి వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వేరుచేయు విధానంపై అవగాహన



పోషకాహార వంటలను వండుతున్న విద్యార్థులు

వేముల : మండల పరిధిలోని ఎద్దులయేనే గ్రామంలో శనివారం పులివెందుల ఫుడ్‌అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్ర పరిసర ప్రాంతాలలో పిచ్చిమొక్కలను తొలగించి ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేయు విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆహారంలో పోషకాహారాలతో కూడిన రాగి ఓట్స్ లడ్డూ, బొప్పాయి జామ్‌ను చేసి చూపించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు ఏడు కొండలు, జయమ్మ, రాజశేఖర్, కళాశాల వలంటీర్లు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దండి

ఎస్ఈబీ సీఐ రామాంజనేయులు



డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ సీఐ రామాంజనేయులు

పులివెందుల రూరల్ : డ్రగ్స్ రహిత ప్రాంతంగా పులివెందులను తీర్చిదిద్దేందుకు మనమంతా పాటుపడాలని ఎక్సైజ్ ఎస్ఈబీ సీఐ రామాంజనేయులు తెలిపారు. శనివారం పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాల, లయోలా కళాశాలల విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో యువత మత్తు పదార్థాలకు, పొగాకు, డ్రగ్స్ లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు అమ్మినట్లయితే వెంటనే మా దృష్టికి తీసుకురావాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటుపడటంవల్ల కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయన్నారు. అందువల్ల మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్ జీఎస్ఎస్ రాజు, అమల్‌రాజ్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పక్షి స్థావరాలను ఏర్పాటు చేసుకోవాలి

వీరపునాయునిపల్లె : నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు పొలంలో పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. శనివారం మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు ఉరుటూరు సచివాలయ పరిధిలో సాగు చేసిన బుడ్డ శనగ పంటలో పొలంబడి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమగ్ర సస్యరక్షణ మరియు పోషక యాజమాన్యం గురించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇందుకూరు సచివాలయ పరిధిలో పంట నమోదు చేయించుకున్న రైతులందరూ రైతు భరోసా కేంద్రానికి వెళ్లి ఈ-కేవైసీ పూర్తి చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

కమలాపురంలో మహిళా ఓటర్లే కీలకం



వల్లూరు : ఓటరు జాబితా సంక్షిప్త సవరణ–2023 ప్రక్రియలో భాగంగా ప్రకటించిన ఓటరు జాబితాలో ఓటర్ల సంఖ్య పరంగా కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం జిల్లాలో చివరి స్థానంలో నిలిచింది. 2,59,720 మంది ఓటర్లతో జిల్లా మొత్తం మీద జిల్లా కేంద్రమైన కడప అసెంబ్లీ నియోజకవర్గం మొదటి స్థానంలో నిలువగా, 2,45,327 మంది ఓటర్లతో జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గం రెండవ స్థానంలో, 2,24,430 మంది ఓటర్లతో పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నాలుగవ స్థానంలో నిలిచాయి. కాగా 1,97,034 మంది ఓటర్లతో కమలాపురం నియోజకవర్గం చివరి స్థానంలో నిలిచింది.

మహిళా ఓటర్లే అధికం

కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా వున్నారు. నియోజవర్గంలో మొత్తం 1,97,034 మంది ఓటర్లు వుండగా అందులో 97,071 మంది పురుష ఓటర్లు వుండగా 99,930 మంది మహిళా ఓటర్లు, 33 మంది ట్రాన్స్ జండర్‌లు వున్నారు. నియోజకవర్గం మొత్తం మీద పురుష ఓటర్ల కంటే 2,859 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా వున్నారు. దీంతో ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ వంటి స్థానిక సంస్థల ఎన్నికల్లోనే గాక అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సైతం మహిళా మణులే కీలక పాత్ర పోషిస్తారని చెప్పక తప్పదు.

పెండ్లిమర్రి మండలంలో భిన్నం

నియోజకవర్గ పరిధిలోని కమలాపురం, వల్లూరు, చింతకొమ్మదిన్నె, చెన్నూరు, వీరపునాయునిపల్లె మండలాలలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా వుండగా పెండ్లిమర్రి మండలంలో మాత్రం అందుకు భిన్నంగా మహిళా ఓటర్ల కంటే పురుష ఓటర్లు ఎక్కువగా వుండడం గమనార్హం. మండలంలో మొత్తం 17,705 మంది పురుష ఓటర్లు వుండగా 17,472 మంది మహిళా ఓటర్లు వున్నారు. ఈ మండలం మొత్తం మీద 233 మంది పురుష ఓటర్లు ఎక్కువగా వున్నారు.

నియోజకవర్గంలో మండలాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి

మండలం	పోలింగ్ స్టేషన్‌ల సంఖ్య	పురుషులు	మహిళలు	ట్రాన్స్ జండర్లు	మొత్తం
కమలాపురం	59	19997	20857	20	40874
చెన్నూరు	35	14725	15685	4	30414
వల్లూరు	29	10717	11074	3	21794
వీఎన్ పల్లె	31	12218	12732	0	24950
పెండ్లిమర్రి	44	17705	17472	3	35180
సీకే దిన్నె	51	21709	22110	3	43822
మొత్తం	249	97071	99930	33	197034

గర్భిణులకు ఫోన్ ద్వారా ఆరోగ్య సేవలు

జమ్మలమడుగు : గర్భిణులకు, బాలింతలకు ఇకపై ఫోన్‌ల ద్వారా ఆరోగ్య సేవలను అందిస్తారని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ తెలిపారు. శనివారం పట్టణంలోని ఎస్సీకాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించి మాట్లాడారు. భారత ప్రభుత్వం గర్భిణులకు, బాలింతలకు ఈ ఆరోగ్య సేవలను ప్రారంభించారన్నారు. ప్రతి వారం 012448800 నంబర్ ద్వారా ఫోన్ నంబర్‌లు నమోదు చేసుకున్న గర్భిణులకు, బిడ్డల తల్లులకు ఫోన్‌లు చేసి వారికి ఆరోగ్య సేవలను అందిస్తారన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలోని ఉద్యోగులు, ఆశ వర్కర్లు గర్భిణుల వివరాలను నమోదు చేయడంతో పాటు కచ్చితంగా వారి ఫోన్ నంబర్‌లను తీసుకోవాలన్నారు. పిల్లలకు కచ్చితంగా సకాలంలో టీకాలను వేయించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సీఓ శ్రీనివాసులు, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలి



ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను సాధించిన లయోలా పాలిటెక్నిక్ కళాశాల

ప్రొద్దుటూరు కల్చరల్ : క్రీడాకారులు నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని రాయలసీమ వ్యాయమ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం రాత్రి 25వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ముగింపు కార్యక్రమంలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు మాట్లాడుతూ త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి క్రీడల్లో కూడా ప్రతిభ చూపి సత్తా చాటాలన్నారు. ఈ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను పులివెందుల లయోలా పాలిటెక్నిక్ కళాశాల గెలుపొందింది. ఈ సందర్భంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పరుగు పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందించారు. సీబీఐటీ డిప్లమో కళాశాల ఇన్‌చార్జి రమేష్, ఆర్గనైజర్ మంజునాథ్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి పీడీ థామస్, జిల్లాలోని పలు పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన వ్యాయామ అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.